

## చరిత్రకెక్కిన చరితార్థులు

# విశ్వకవి వేమన

(వంగూరి ఫౌండేషన్ ఉగాదికి నిర్వహించిన పోటీలలో ప్రథమ బహుమతి పొందిన వ్యాసం)

- శ్రీ దూర్వాసుల వేంకట సుబ్బారావు.

(గత సంచికలోని వ్యాసానికి తరువాయి భాగం)

### కులభేదాలు

' కులము లేనివాడు కలిమిచే వెలయును
కలిమి లేనివాడు కులము దిగును
కులముకన్న మిగుల కలిమి ప్రధానంబు విశ్వ ॥'

అని ఎత్తి పొడుస్తూ, అన్ని కులాలు ఒకే కులంగా మారాలి, అదే వసుధైక మానవకులం అని ఏనాడో వేమన ఈ విధంగా అన్నాడు.

' ఉర్వి వారికెల్ల ఒక్క కంచంబు పెట్టి
పొత్తు గలిపి కులము పొలయ జేసి
కులముకన్న మిగుల గుణమె ప్రధానంబు విశ్వ ॥'

వేమన ప్రభావం యుగయుగాలుగా ఉంది అన్నదానికిది నిదర్శనం.

' మాల కర్మచేత మాలడయ్యె, ఏల తెలియరో యీ నరపశువులు' అని వేమన అంటే 'మంచి యన్నది మాలయైతే, మాలనేనగుదున్' అన్నాడు శ్రీ గురజాడ.

' ఉర్వి వారికెల్ల నొక్క కంచంబు పెట్టి - పొత్తు గలిపి కులము పొలయజేసి' అని వేమన ఆశిస్తే 'కులముతో పనిలేదు, గుణము తోడను లేదు మానవత్వమెరుగు, మర్త్యలోకపు వెలుగు' అని శ్రీ కాళోజీ స్పందించేరు.

### మతాచారాలు

ఆనాటి మతాల్లో అవినీతి, విగ్రహారాధన, మూఢనమ్మకాలు, జీర్ణిస్తున్న మానవత్వం, దీనికి తోడుగా తన జీవిత సంఘటనలు వేమన దృక్పథాన్ని మార్చేయి. కేవలం ప్రతిఘటనే కాకుండా, ప్రజలకు ప్రబోధనలుగా ఈ తాత్వికుడు వేదాంత సందేశాన్ని అందించాడు. ఈ ప్రపంచంలో సత్యమనేది ఒకటే - అదే తన అభిమతమంటూ :

మతములెన్నియైన సతముగా నుండవు
సతముగాను యుండు జగతి నొకటి
యంత మతము విడిచినా బ్రహ్మమరయుట విశ్వ ॥

నిజములాడువాని నిందించు జగమెల్ల
నిజములాడరాదు నీచుతోను
నిజమహాత్ముగూడి నిజమాడవలయుగా విశ్వ ॥

**చిత్తశుద్ధికి తార్కాణంగా:**

చిత్తశుద్ధి గలిగి చేసిన పుణ్యంబు
కొంచెమైన నదియు కొదువగాదు
విత్తనంబు మర్రి వృక్షంబునకు నెంత? విశ్వ ||

**సత్యమే మానవత అని ఉదహరిస్తూ:**

'కల్లలాడు కంటె కష్టంబు మరిలేదు' అన్నాడు.

వేదాంతి కావటం వలన ఏ దేముడ్నీ మూఢభక్తితో నమ్మలేదు. ఉదాహరణకు:

పాల సాగరమున పవ్వళించిన సామి
గొల్ల యిండ్ల పాలు గోరనేల?
ఎదుటి వారి సొమ్ము ఎల్లవారికి తీపి విశ్వ ||

శివుడు గలడటంచు శిలలకు మ్రొక్కెడి
వెర్రి జీవులార వెతలు విడుడి
జీవులందు కాక శిలలనేమున్నది విశ్వ ||

కనక మృగము భువిని కలదు లేదనడయ్యె
రాముడంత వెర్రి రాజు గలడె
పురము దప్పిపోవ బుద్ధులు నిలువవు విశ్వ ||

ఇలాగే పరశురాముని, ధర్మరాజుని కూడా విమర్శించేడు వేమన. వేమన వీరశైవుడని ఒక వాదం. వీరశైవులు బహుదేవతలను నమ్మరు. కావుననే వేమన అందరి దేముళ్ళని నిరసించేడు అన్నదో వాదం. ఆత్మశుద్ధి, చిత్తశుద్ధి లేకుండా పూజలు పునస్కారాలు చేయటం వృధా అని పరిహసించేడు ఈ విధంగా:

ఆత్మ శుద్ధిలేని యాచారమదియేల?
భాండశుద్ధి లేని పాకమేల?
చిత్తశుద్ధిలేని శివపూజలేలరా? విశ్వ ||

కాశియాత్రబోయి గంగదానము జేసి
కష్టపడిరి ముక్తి గానలేక
ఎనుము తిరుగుచుండదే యెద్దు వెంబడి విశ్వ ||

**ఆ రోజుల్లో నవాబుల ప్రాబల్యం విస్తరించుచున్నాది. వారి గురించి:**

మక్కాకు బోనేల మగుడ తారానేల?
యేకమైన కర్త యిందులేడో?
అన్నిట పరిపూర్ణ డల్లా మహమ్మదు విశ్వ ||

తిరుమలకు బోవ తురక దాసరిగాడు
కాశిబోవ లంజ గరిత గాదు
కుక్క సింహమగునె గోదావరికి బోవ విశ్వ ||

**కర్మలు, ఆచారాలు వ్యర్థమని విలపిస్తూ, ఎత్తి పొడుస్తూ ఇలా అన్నాడు:**

పిండముల జేసి పితరుల దలపోసి
కాకులకును బెట్టు గాడ్దెలార
పియ్యదినెడి కాకి పితర యెట్లాగయా విశ్వ ||

**వేమనలో ఇంకో విశేషమేమంటే ప్రశ్నించడం. ఉదాహరణకు:**

'కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?'
'తలలు బోడులైన తలపులు బోడులా?'

'విత్తనంబు మర్రి వృక్షంబునకు నెంత?'
'పచ్చికుండ నీళ్ళు పట్టిన నిలుచునా?'

'బొగ్గు పాలగడుగ బోవునా నైల్యంబు?'

**వేమన పద్యాల్లో సూక్తులు, అంటే అందరి విజ్ఞానాన్ని కలిపి, తన చమత్కారాన్ని కలిపి నగ్నసత్యాలు, కోకొల్లలు. ఉదాహరణకు:**

'వెల్లుకన్న దిక్కు వేరెవ్వరున్నారు'
'తల్లి తానెరుగును తనయుని జననంబు'
'పదుగురాడు మాట పాటియై ధరజెల్లు'
'తల్లి నెరుగువాడు దైవంబు నెరుగును'
'నిలువదగని చోట నిలువ నిందలు వచ్చు'

'వ్యాధి తెలియని వైద్యుడు మరియేల'
'ఆడుదాని వంక నందరు చుట్టాలు'
'లోభివాని నడుగ లాభంబు లేదయా'
'చెప్పు తినెడి కుక్క చెఱకు తీపెరుగునా'
'పచ్చికాయ దెచ్చి పడవేయ ఫలమౌనె'

ఆలిమాట విని అన్నదమ్ముల రోసి
వేఱె పోవువాడు వెఱ్ఱివాడు
కుక్కతోకబట్టి గోదావరీదునా? విశ్వ ॥

ఆలివంకవారు ఆప్తబంధువులైరి
తల్లివంకవారు తగినపాటి
తండ్రి వంకవారు దాయాది పగవారు విశ్వ ॥

'ఆడుదాని జూడ నర్థంబు జూడగ
బ్రహ్మకైననెత్తు రిమ్మ తెగులు'

**నేటి రాజకీయాల్ని గుర్తు చేయడానికే అన్నట్లు వేమన ఏమన్నాడంటే:**

కోతిబట్టి తెచ్చి కొత్త పట్టము కట్టి
కొండముచ్చులెల్ల కొలచినట్లు,
నీతిహీను వద్ద నిర్భాగ్యులందరు విశ్వ ॥

రాగ,ద్వేష, అభిమానాల్ని నిరోధించి, తత్వసిద్ధి పొందాలన్నది పతంజలి యోగశాస్త్రం చెప్పగా, ఆసనాలకి, అభ్యాసాలకి ఎక్కువ మక్కువ చూపుతూ అసలు విషయాల్నే విస్మరిస్తున్నారని పరిహసిస్తాడు వేమన:

ఆసనములు పన్ని అంగంబు బిగియించి
యొడలు విరిచికొనెడు యోగమెల్ల
జెట్టిసాము కన్న చింతాకు తక్కువ విశ్వ ॥

ఇంద్రియముల చేత నెగ్గొందు చుండెడు
వెర్రి మనుజుడేల వెదకు శివుని
ఇంద్రియములరోసి యీశుని జూడుడీ విశ్వ ॥

ముక్కుత్రాళ్ళు గుచ్చి మురికిబోవగ దోమి
కచ్చనీరు నించి కడిగి కడిగి
డొక్క దుడిచినంత దొరుకునా మోక్షంబు విశ్వ ॥

'ఆసనాది విధులు అల్పయోగంబులు'
హిందువుల ఆచార్య వ్యవహారాలను నిరసిస్తూ, పరిహసిస్తూ క్రైస్తవులు వేమన సూక్తులను వాడుకున్నా, గ్రిబిల్ క్రైస్తవ మతంలోని 10 సూత్రాలు 'తనకోపమె తనశత్రువు, తన శాంతమె తనకు రక్ష, దయ చుట్టంబౌ' లాంటివి వేమన వ్రాసినవి గుర్తించేడు.

## వేమన: హాస్యం

అందరికి తెలిసిన విషయాన్నే, నీతిబోధనతో సమన్వయ పరుస్తూ హాస్యరూపంలో 'గొడ్డుటావు పాలు గోకితే చేపునా' అంటూ ఆఖరికి

గొడ్డుటావు బిదుక గుండ గొంపోయిన
పండ్లు రాలదన్ను; పాలనీదు
లోభివాని నడుగ లాభంబు లేదురా విశ్వ ||

**అలాగే:**

మేక కుతిక మెడచన్ను గుడువుగా
ఆకలేలమాను నాశగాక
లోభివాని నడుగ లాభంబు గలుగునా విశ్వ ||

గురువునకు పుచ్చకూరైన నివ్వరు
అరయ వేశ్యకిత్తు రర్థమెల్ల
గురుడు వేశ్యకన్న కులహీనుడేమెకో విశ్వ ||

'తలలు బోడులైన తలపులు బోడులా'
'మొండివాని కేల ముంజేతి కడియాలు'
ఎన్నో హాస్యాకరంగా చెప్పేడు.

వేమన కవిత్వంలో ఇంకో విశిష్టత విరోధోక్త్యలంకారము. దీన్ని ఇంగ్లీషులో 'ఆక్సిమోరాన్' అంటారు. ఉదాహరణకు "డబ్బుతో బీదరికాన్ని కొనుక్కోలేము." పొత్తులేని రెండంశాలకి పొత్తు కుదర్చటం. దీన్ని వేమన చాలా చోట్ల ప్రయోగించేడు. ఉదాహరణలు:

'కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా'
'పెద్ద పిన్నతనము పేరెమి ఈలాగు'
'పిరికి వాని మదిని బింక మీలాగురా'
'వెలయు వనములోన మలయజంబున్నట్లు'

'పరిమళములు మోయ ఖరము తాగజమౌనె'
'చెప్పు తినెడి కుక్క చెఱకు తీపెరుగునా'
'కొలని హంసకడకు గొక్కెర మన్నట్లు'
'పచ్చి కాయ దెచ్చి పడవేయ ఫలమౌనె'

**మరికొన్ని ఉదాహరనలు వేమన కవిత్వంలో:**

'తినగ తినగ వేము తీపినుండు'
'గాలిగాలి గలిసె, గగనంబు గగనంబు'

'వెదుకు వెదుకు దొరుకు వేదాంత వేద్యుండు'
'మాయ రూపు, రూపు మాయగా జేసియు'

'వాడు వాడు, వాడు వాని లోపలనుండు'

**భర్తృహరి** 'విత్తజాడ్యహత బుద్ధుల కంజలి చేసితింగటా
తలకక యింకనేపనికి దార్చెదు నన్ను దురాశ, నీవిటన్' అని చెప్తే,

**వేమన** 'ఆశదగిలి నరుడు నాలాగే చెడిపోవు' అన్నాడు.

**భర్తృహరి** 'ఏ నరునకు విత్తము గలదో
ఆ నరుడు కులీనుడు అధికుడు ఆర్యుడతండే
ధీనిధి ధన్యుడు నేర్పరి
నానాగుణము కాంచనంబు నిలచున్' అని అంటే

**వేమన** 'కులము లేనివాడు కలిమిచే వెలయును' అన్నాడు.

ఇలా చాలా సామీప్యాలు చూపించవచ్చు వైరాగ్య శతకానికి, వేమన శతకానికి. మేధావుల ఆలోచనలు ఒకే రకంగా ఉంటాయి అంటారు.

చదువు చదువకున్న సౌఖ్యంబులును లేవు
చదువు చదివెనేని సరసుడగును
చదువు మర్మమెఱిగి చదువంగ జూడుము విశ్వ ॥

అని వేమన చదువులగురించి అంటే

చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్యశాస్త్రంబుల్
నే చదివినవి కలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల, చదివితి తండ్రీ!

అని ప్రహ్లాదునిచే పోతనగారనిపించేరు.

పోతనగారి గుణుగు పద్యాలు (అదే పదాన్ని చాలా పర్యాయాలు వాడ్డం) ప్రసిద్ధి. ఇది పోతనగారి పోత. ఉదాహరణకు:

పలికెడిది భాగవతమట, పలికించెడువాడు రామభద్రుండట
నేపలికిన భవహరమగునట, పలికెద వేరొండగాథ పలుకగనేలా?

**వేమన:** జీవిజీవికి జంపి, జీవికి వేయగా, జీవివలననేమి జిక్కియుండె
జీవహింసకు జిక్కునా జీవంబు విశ్వ అన్నాడు.

## వేమన: శాస్త్ర పరిజ్ఞానం

ఈ లోకంలో డబ్బుంటేనే బ్రతుకు అన్నది తెలియజేసేడు వేమన:

ఇహమున సుఖియింప హేమతారకవిద్య
పరమున సుఖియింప బ్రహ్మవిద్య
కడమ విద్యలెల్ల కల్లమూఢుల విద్య విశ్వ ॥

అయితే ఈ హేమతారక విద్య అంటే చౌక లోహాల్ని ఖరీదైన వెండి బంగారాలుగా మార్చే కృషి. చైనీయులు, హిందువులు, అరబ్బీయులు, గ్రీస్ దేశస్థులు రకరకాల మారుపేర్లతో ఈ విద్యను సాధింప ప్రయత్నించారు. 'ఆశదగిలి నరుడు నాలాగె చెడిపోవు' నన్న వేమన కూడ తన స్నేహితుడు అభిరామయ్య సహాయంతో బంగారం తయారీ ప్రయోగాలు చేసేవాడుట. వాటిని 15 పద్యాలలో సూచించాడు. ఉదాహరణకు:

ఇంటి వెనుక తీగ, యింగ్లీకముండంగ
పారదంబు గలుగు, బసిడి యేల
సత్తు పొత్తు చేసి, సాధింపవచ్చుగా విశ్వ ॥

కాని చిక్కేంటంటే ఆ ఇంటి వెనుక తీగ ఏదో తెలియజేయలేదు. కాని మిగతావి యింగ్లీకము (మైలతుత్తం - కాపర్ సల్ఫేటు), పారదంబు (పాదరసం - మెర్క్యురీ), సత్తు (తగరము - టిన్) ల గురించి ప్రస్తావించేడు. దీన్నే చమత్కారంగా:

బ్రహ్మజంపి విష్ణుభాగంబులో కల్పి
శివుని జంపి శివుని వెలయు గలిపి
శివుని జంపి తాను శివయోగి కావలె విశ్వ ॥

**దీన్నే రసవాద పదాల్లోకి మారిస్తే:**

బ్రహ్మ అనగా తాళకం (ఆర్సెనిక్ ట్రై సల్ఫేటు), విష్ణు అనగా మైలతుత్తం (కాపర్ సల్ఫేటు) - ఈ రెంటిని కలిపి పుఠంవేసి ఆ భస్మాన్ని బంగారంగా మార్చుకోవచ్చునట!
ఇంకో సందర్భంలో వేమనకు లోహములగురించి తెలిసినది చెప్తాడు:

ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు
కాచి యతకవచ్చు కమ్మరీడు
మనసు విరిగెనేని మరి యంటనేర్చునా విశ్వ ॥

అలాగే 'కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా' కూడా గమనించతగ్గదే.

**నాకు బాగా నచ్చినది:**

భూపతి కృపనమ్మి, భూమి జెరచువాడు
ప్రజల యుసురు దాకి పడును పిదప
ఎగురవేయు బంతి యెందాక నిల్చురా విశ్వ ॥

వేమన తర్వాత న్యూటన్ (1642 - 1722) కనిపెట్టిన భూమ్యాకర్షణ సిద్ధాంతం స్ఫురింపజేస్తుంది ఈ పద్యం. ఇలా చెప్పాలంటే వేమన చెప్పిన పద్యరత్నాలలో ఇలాంటి
'నీళ్ళలోన మీను నిగిడి దూరము పాఱు' 'చేప పిండు బెద్ద చేపలు జంపు'
'వడిని నీరు నదిని గడుతేటమై యుండు' విశేషాలు ఎన్నో ఉన్నాయి, మనం గ్రహించాలేగాని.

**వేమన: వేదాంతము**

మన మతగురువులు దక్షిణామూర్తి, ఆదిశంకరులు, రమణమహర్షిలలో మధ్యముడు ఆదిశంకరులు 'ఆత్మబోధ, వివేకచూడామణి'లలో ప్రవచించినట్లు, కవిత్రయంలో మధ్యముడు వేమన ఉపనిషత్ పంథాలో కొన్ని మహావాక్యాలు చెప్పేడు:

'మనసు తెలియువాడు మర్మజ్ఞుడౌనయా' 'యెరుకలోని యెరుక నెరుగుట తత్వంబు'
'నీవునిన్నెరుగంగ నీవెపో శివుడవు' 'బయలు లోన బయలు భావింప తత్వంబు'

ఇలా చిత్తవృత్తులు నాశనమే తత్వం అని, ముక్తికి సోపానమార్గమని చెప్పేడు వేమన.

**వేమన వేదాంతా? యోగా? కవా?**

బెట్రండ్ రస్సెల్‌ని ఇలాగే నీవు గణిత శాస్త్రజ్ఞుడవా, వేదాంతివా? అని అడిగితే ఇదికాదు, అదికాదు, ఈ రెంటిని సమన్వయపరుస్తూ, వాటి బీటలు మీద నిలుస్తానన్నాడు. అలాగే 500 సంవత్సరాల క్రిందట వేమనని ఇలాంటి ప్రశ్నేవేస్తే బహుశ: ఏమంటాడో ఊహిద్దాం:

వెతలు దీర్చువాడు వేదాంత వేద్యుడు
రతుల నేలువాడు రసికుడగును
సతిని పెనగువాడు సంసారయోగిరా విశ్వ ॥

'చదువ పద్య మరయ చాలదా యొక్కటి' అని సవినయంగా వేదాంతుడనని, రసికుడనని, యోగినని, కవినని చెప్పుకున్నాడు. మనలో చాలామంది కంఠస్తం చేసిన పద్యము:

చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలిముల్లు
ఇంటిలోని పోరు ఇంతింతగాదయా విశ్వ ॥

లోకభాషలో అందరికీ సులభగ్రాహ్యమైన అర్థం - వేసుకున్న కాలిజోడిలోని రాయి, చెవిదగ్గర ఈగ, కన్నులో పడ్డ నలుసు, పాదంలో గుచ్చుకున్నముల్లు, ఇంట్లో దైనందిక గలాటాలు చెప్పనలవికాదని. దీన్నే ఇంకో పరంగా కూడా అర్థం చెప్తే: లోని రాయి - హృదయం, చెప్పు - గుర్తు చేస్తుంది, చెవి - చెవి, లోని జోరి ఈగ - చెవిలో కూడి వార్తలు వినిపించటం, కంటి - శివుడు, లోని నలుసు - మనలోని లోపాలు, కాలి - యముడు, ముల్లు - శిక్షించటం, ఇంటి - ఈ దేహము, లోని పోరు - జరిగే సంఘర్షణ, ఇంతింత గాదయా - చెప్పలేనంతది కదా!

చెప్పుడు మాటలు విని, శరీరం ఘర్షణ పడటం మనలోని లోపాలు అని మన హృదయం తెలియజేయును. దీని పర్యవసానం శిక్ష ననుభవించటమే. ముగిస్తూ, యోగిగా, జ్ఞానిగా, ప్రజాకవిగా, విశ్వకవిగా నీతిబోధ, సామాజిక వ్యాఖ్య తనదైన ప్రత్యేక ఆటవెలది శైలిలో వేమన మనకి అందించేడు. అందుకే వేమన ఆధ్యుడు, ఆరాధ్యుడు.

వేయు విధము లమర వేమన పద్యంబు । లర్థ మిచ్చు వాని నరసిచూడ
చూడ చూడ బుట్టు చోద్యమై జ్ఞానంబు । విశ్వదాభిరామ వినురవేమ.